

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మండలంలోని డి3 - ఏలూరు సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కెవి వట్లూరు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న 11 కెవి సిద్ధార్థ ఫీడర్, రిలయన్స్ ఫీడర్స్ మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు చెట్ల కొట్టివేత చేపట్టనున్నట్లు తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఆపరేషన్) జెబిబి.నటరాజన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో వట్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ, చలసాని గార్డెన్స్, క్రాంతి కళ్యాణ మండపం ఏరియా, సిఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ, సిఆర్.రెడ్డి పాలిటెక్నిక్ కాలేజీ, ఆర్‌టిసి కాలనీ, సౌభాగ్యలక్ష్మి నగర్, విద్యుత్ కాలనీ, నాయుడు హోటల్ ఏరియాలకు మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని నటరాజన్ కోరారు.

మంత్రులెవరో..!

సీనియర్ నేతలంతా గంపెడాశతో ఎదురుచూపులు

మంత్రుల జాబితా నేడు వెల్లడయ్యే అవకాశం

ప్రముఖంగా పితాని, నిమ్మల పేర్లు

జనసేన, బిజెపికి కేటాయింపుపై పలు ఊహాగానాలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా నుంచి బుధవారం ప్రమాణస్వీకారం చేసే మంత్రులెవరో అంటూ సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నేడు ఎన్‌డిఎ ఎంఎల్‌ఎలు అంతా సమావేశం కానున్నారు. సిఎం అభ్యర్థి నిర్ణయం, సాయంత్రానికి మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే నేతల పేర్లు ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో తొలి కేబినెట్‌లో జిల్లా నుంచి ఎవరు మంత్రివర్గంలో ఉంటారనే చర్చ సర్వత్రా కొనసాగుతోంది. ఈ నెల 12న చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైంది. మంత్రివర్గ కూర్పుపై సైతం కసరత్తు సాగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. జిల్లా నుంచి ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ, పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇంకా స్పష్టత మాత్రం రాలేదు. జిల్లా నుంచి ఒకరు లేక ఇద్దరు మంత్రులుగా ఉండే అవకాశం ఉంది. కేబినెట్‌లో 25 మందిని మంత్రులుగా నియమించే అవకాశం ఉంది. రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లాలు ఉన్నాయి. జిల్లాకు ఇద్దరు చొప్పున మంత్రులుగా నియమిస్తేనే అన్ని జిల్లాలకు న్యాయం జరుగుతుంది. 13 జిల్లాల్లో దాదాపు ఎనిమిది జిల్లాలో టిడిపి క్లీన్‌స్వీప్ చేస్తూ అన్ని స్థానాలను గెలుచుకుంది. మంత్రివర్గంలో ఏ జిల్లాకు సరైన ప్రాతినిధ్యం లేకపోయినా తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా ప్రతి జిల్లాలోనూ సీనియర్ నేతలు ఎక్కువగానే ఉన్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పరిశీలిస్తే మూడుసార్లు ఎంఎల్‌ఎగా గెలుపొందిన నిమ్మల రామానాయుడు, తణుకు నుంచి రెండుసార్లు ఎంఎల్‌ఎగా గెలుపొందిన ఆరిమిల్లి రాధాకృష్ణ, గతంలో కాంగ్రెస్‌లో, 2014 నుంచి 2019 వరకూ టిడిపిలో మంత్రిగా పని చేసిన పితాని సత్యనారాయణ, దెందులూరు నుంచి మూడోసారి ఎంఎల్‌ఎగా గెలిచిన చింతమనేని ప్రభాకర్, జగన్‌పై తిరుగుబాటు చేసి పేరొంది టిడిపి నుంచి ఉండి ఎంఎల్‌ఎగా గెలిచిన కనుమూరి రఘురామకృష్ణంరాజు, మాజీ మంత్రి, నూజివీడు ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారథి వంటి వారు మంత్రి పదవుల రేసులో ఉన్నారు. కైకలూరు ఎంఎల్‌ఎగా బిజెపి తరపున గెలిచిన కామినేని శ్రీనివాస్, భీమవరం నుంచి మూడోసారి ఎంఎల్‌ఎగా జనసేన నుంచి ఎన్నికైన పులపర్తి ఆంజనేయులు వంటివారి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. వీరంతా ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మరంగా చేస్తున్నారు. శెట్టిబలిజ కోటా నుంచి పితాని సత్యనారాయణ, కాపుల కోటా నుంచి నిమ్మల రామానాయుడు పేర్లు వినిపిస్తున్నప్పటికీ అనేక ఊహాగానాలు తెరపైకి వస్తున్నాయి. 2014 టిడిపి ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణలో మంత్రి పదవి ఇస్తారేమోనని దెందులూరు ఎంఎల్‌ఎగా ఉన్న చింతమనేని అలగడం, తర్వాత ఆయన్ని బుజ్జగించడానికి విప్ పదవి ఇవ్వడం సైతం జరిగాయి. ప్రతిపక్షంలో ఉండగా జిల్లాలో టిడిపికి నిమ్మల రామానాయుడు దిక్కుగా నిలిచారు. దీంతో మంత్రి పదవులు ఎవరికి దక్కుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. అదే తరుణంలో జనసేనకు, బిజెపికి జిల్లా నుంచి మంత్రి పదవుల్లో ప్రాతినిధ్యం ఉంటుందా అనే చర్చ సైతం నడుస్తోంది. అదే జరిగితే పూర్వపు పశ్చిమగోదావరి జిల్లాలో జనసేన ఆరు స్థానాల్లో పోటీ చేసి గెలిచింది. తూర్పుగోదావరి జిల్లా కోటాలో పవన్ కళ్యాణ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. పూర్వపు పశ్చిమలో జనసేనకు ఒక మంత్రి పదవి కేటాయిస్తే ఎవరికి ఆ పదవి దక్కుతుందనే చర్చ సైతం పెద్దఎత్తున నడుస్తోంది. ఇప్పటి వరకూ మంత్రి పదవులకు సంబంధించి ఎటువంటి లీకేజీలు వెలువడలేదు. మంగళవారం మంత్రి పదవుల జాబితాపై స్పష్టత రానున్నట్లు చెబుతున్నారు. దీంతో నాయకుల అనుయాయులంతా తమ నాయకుడికి మంత్రి పదవి వస్తుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, కౌలు రైతులు, నేతలు

ధాన్యం బకాయిలు చెల్లించాలి

కలెక్టరేట్ వద్ద రైతులు, కౌలు రైతుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని ఎపి రైతు, కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద రైతులు, కౌలు రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు, కౌలు రైతులు రబీ ధాన్యం అమ్మి 40 రోజులు దాటిపోతున్నా సొమ్ములు చెల్లించకపోవడం అన్యాయమని విమర్శించారు. ఎన్నికల ముందు మాత్రం రెండు మూడు రోజులకే చెల్లించి, ఎన్నికల అనంతరం పౌర సరఫరాల శాఖ చేతులెత్తేయడంతో అన్నదాతలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో దాదాపు రూ.200 కోట్ల ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఖరీఫ్ సాగు సమయం ముందుకు రావడంతో విత్తనాలు కొనుగోలు చేయడానికి కూడా చేతిలో పెట్టుబడికి సొమ్ము లేక అన్నదాతలు అల్లాడిపోతున్నారన్నారు. గత పంట అప్పులు చెల్లించకపోవడంతో ఖరీఫ్ సాగు పెట్టుబడి అప్పులు దొరికే పరిస్థితి లేదన్నారు. ధాన్యం సొమ్ములు వెంటనే చెల్లించి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి లక్ష్మణరావు, చిన్ని పోతురాజు, వెలగలేటి మోహనరావు, లావేటి సోంబాబు, కానూరి రాజు, అన్నంరెడ్డి రంగారావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయి వేతనాలు చెల్లించాలి

డ్వామా పీడీకి వ్యకాస వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులకు, కొల్లేరు పేదలకు అదనంగా ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని ఉపాధి హామీ కార్యాలయంలో డ్వామా పీడీ ఎ.రాముకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని 27 మండలాల్లో ఉపాధి కూలీలకు కనీసం సౌకర్యాలు కల్పించడం లేదని విమర్శించారు. సుమారు 15 మండలాల్లో ఈ సమస్యలతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే పనిచేసి మూడు నుండి ఆరు వారాలు అవుతున్నా కూలీలకు వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారన్నారు. పని దినాలు పెంచాలని అడిగిన సందర్భంలో మండల స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. చాట్రాయి మండలంలో కూలీల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. బుట్టాయగూడెం మండలం రెడ్డి గణపవరంలో ఐదు వారాల వేతనాలు ఇవ్వాలన్నారు. జీలుగుమిల్లి మండలం పి.రాజవరం, సిరివారిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట, నాగులగూడెం గ్రామాల్లో ఉపాధి పనులు అడిగినా కల్పించడం లేదని తెలిపారు. ఏలూరు, ఆగిరిపల్లి, దెందులూరు, లింగపాలెం, టీ నర్సాపురం, కలిదిండి, పెదవేగి మండలాల్లో కూలీలకు ఐదు వారాల వేతనాలు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. పోలవరం నిర్వాసితులకు, కొల్లేరు పేదలకు అదనంగా పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏలూరు నగరంలో విలీనం చేసిన 7 గ్రామపంచాయతీలలో ఉన్న పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాబోయే ప్రభుత్వం పేదల సమస్యలపై చర్చించి పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డ్వామా పీడీ రాము మాట్లాడుతూ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని దగ్గర పెట్టుకొని మండలాల వారీగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. సరిగా పని చేయని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రవి పాల్గొన్నారు.



డ్వామా పీడీకి వినతిపత్రం అందజేస్తున్న వ్యకాస నేతలు

సత్యసాయి పైపులైన్లకు మరమ్మతులు

17 మండలాలకు నిలిచిన తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం నుంచి తూర్పుగోదావరి జిల్లా ఏలూరు జిల్లాలో 17 మండలాలకు నిత్యం తాగునీరు పంపిణీ చేసే సత్యసాయి మంచినీటి పథకం పైపులైన్లకు కన్నాపురం అడ్డురోడ్డు నుంచి దొండపూడి వెళ్లే రోడ్డు మార్గంలో 4 చోట్ల మరమ్మతులకు గురైంది. దీంతో సోమవారం సత్యసాయి తాగునీటి సరఫరాను నిలిపివేశారు. ఆ మార్గంలో భూమి లోపల నుంచి ఏర్పాటు చేసిన పైపులైన్లు నీటి ఒత్తిడికి పలుచోట్ల పైపులైన్లు పగిలి లీకవుతున్న నేపథ్యంలో సత్యసాయి కాంట్రాక్టర్ టివివి సత్యన్నారాయణ తాగునీటి సరఫరాను నిలిపివేయించారు. పైపులైన్లు పగిలిన ప్రాంతాల్లో కొత్త పైపులు వేయిస్తున్నారు. నాలుగుచోట్ల పైపులు పగిలిపోయి నీరు లీకవుతోందని, ఆయా ప్రాంతాల్లో మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించడానికి రెండు రోజులు పడుతుందని సిబ్బంది తెలిపారు. ఈ మరమ్మతుల నేపథ్యంలో గోపాలపురం, చింతలపూడి, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం లైన్లలో సుమారు 17 మండలాల్లో 200 గ్రామాలకు పైగా తాగునీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



పైప్‌లైన్ పనులు చేస్తున్న సిబ్బంది

వివాద భూముల్లో పనులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వివాదంలో ఉన్న ఎల్‌టిఆర్ 1/70 చట్ట భూముల్లో జెసిపితో పనులు చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి ఎపి ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. వివాదంలో ఉన్న ఎల్‌టిఆర్ 1/70 భూముల్లో సోమవారం జంగారెడ్డిగూడేనికి చెందిన తగరం శ్రీనివాస్, ఆయన అనుచరుడు భాష ఎల్‌టిఆర్ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి జెసిపితో పనులు చేయిస్తున్నారు. దీంతో స్థానిక గిరిజనులు పనులను అడ్డుకుని తహశీల్దార్‌కు, ఎస్ఐకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో చట్టాలకు విరుద్ధంగా కొంతమంది దళారీలు ఇష్టాను సారంగా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారని, గతంలో కూడా ఇదే విషయాన్ని ఐటిడిఎ పిఒకు, జిల్లా కలెక్టర్‌కు విన్నవించడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నిలుపుదల చేశారని తెలిపారు. మరలా ఇప్పుడు జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన తగరం శ్రీనివాసు, తన అనుచరుడు భాష జెసిపిని తీసుకొచ్చి పనులు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణం సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. వివాద భూముల్లోని రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేయడానికి చూస్తున్న దళారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రిగా వర్మ

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మకు ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా ప్రధాని బాధ్యతలు కేటాయించారు. దీనిపై జిల్లా ప్రజల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. విశాఖ ఉక్కును ప్రయివేటు పరం చేసే యత్నాల్లో భాగంగా మోడీ సర్కార్ ఈ ప్రాంతవాసికి బాధ్యతల అప్పగించిందా అనే వ్యాఖ్యానాలు వినిపించాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో భారీ పరిశ్రమలైన ఏలూరులోని జ్యూట్‌మిల్లులు, తణుకులో ఆంధ్రా సుగర్స్, భీమవరం సమీపంలో డెల్టా పేపర్‌మిల్లు వంటివి మూతపడిన సంగతి తెలిసిందే. వర్మ కొత్త పరిశ్రమలు తీసుకురాకపోయినా మూతపడిన పరిశ్రమలనైనా తెరిపించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

మిడ్డే మీల్స్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి



మాట్లాడుతున్న రమాదేవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను నూతన ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా విస్తృత సమావేశం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో సంఘం నాయకులు అనురాధ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.రమాదేవి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలను కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పరిష్కారించే దిశగా ఆలోచన చేయాలన్నారు. చాలీచాలని జీతాలతో బతుకులు నెట్టుకొస్తున్న మిడ్డే మీల్ కార్మికులను ప్రభుత్వం గుర్తించి ప్రమాద బీమా సౌకర్యం, ఇన్సూరెన్స్, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వమే గ్యాస్ ఇవ్వాలని, మెనూ ఛార్జీలు రూ.20లకు పెంపు చేయాలని, సంవత్సరానికి రెండు జతలు కాటన్ చీరలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో కొన్ని స్కూళ్లలో తొలగించాలని చూస్తున్నారని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తుందని, ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ పెంచాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు పని చేస్తున్న ప్రాంతంలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, అనంతలక్ష్మి, వెంకటలక్ష్మి, అశోక్, వెంకటపద్మ, అంజలీదేవి పాల్గొన్నారు.

జిఒ 117తో విద్యావ్యవస్థ నిర్వీర్యం

నూతన ప్రభుత్వం ఆ జిఒను రద్దు చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే 117 జిఒను రద్దు చేయాలని యుటిఎఫ్ ఏలూరు జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం డిమాండ్ చేసింది. యుటిఎఫ్ ఏలూరు జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం స్థానిక ఏలూరు యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా అలీ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిన ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించారని, రానున్న ప్రభుత్వంపై విద్యా వ్యవస్థను బాగు చేసే బాధ్యత ఉందని చెప్పారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రాక్షి రవికుమార్ మాట్లాడుతూ ఈ రాష్ట్రం లో ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వాలను మార్చే శక్తి ఉందని మరోసారి ఈ ఎన్నికలు రుజువు చేశాయన్నారు. ఈ క్రమంలో కొత్తగా ఏర్పడబోయే టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ పాఠశాల విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న 117 జిఒను వెంటనే రద్దు చేసి ప్రభుత్వ విద్యావ్యవస్థను, పాఠశాల విద్యను, ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, పెన్షనర్ సంఘం బాధ్యులు కస్తూరిరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వ రరావు, జిల్లా కోశాధికారి జివి.రంగ మోహన్, జిల్లా కార్యదర్శులు ఎ.విక్టర్, అల్లాడి రాజు, బి.అనురాధ, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, దాదాపు 80 మంది జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించకపోతే

ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జీవరత్నం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, మండల కార్యదర్శి అందుగుల ప్రభాకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఎంపిడిఒ కెవి.ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం మాట్లాడుతూ మండలంలోని ఉపాధి హామీ కూలీలకు గత 60 రోజుల నుంచి పనులు చేస్తున్నా పే స్లిప్పులు ఇవ్వకపోవడానికి తీవ్రంగా ఖండించారు. ఎ.పోలవరం, తాడువాయి, వేగవరం గ్రామాల్లో ఉపాధి పని చేసే చెరువుల్లో యంత్రాలతో రాత్రులు మట్టి తోలకాలు తోలుతున్నారని పలుమార్లు మండల ఎపిఒకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ చర్యలు తీసుకోలేదని చెప్పారు. వేతన బకాయిలు అందక ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గ్రామాల్లో పని కావాలని అడుగుతున్న కూలీలకు పని కల్పించడం లేదని వాపోయారు. కూలీలు జాబ్ కార్డులు కావాలని దరఖాస్తు పెట్టి నెలల తరబడి అడుగుతున్నప్పటికీ కంప్యూటర్లు పనిచేయటం లేదనే పేరుతో కూలీలకు జాబుకార్డులు ఇవ్వడంలేదన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు పేస్లిప్పులు ఇవ్వాలని, ఉపాధి పని చేస్తున్న చెరువుల్లో యంత్రాలతో మట్టి తోలుతున్న భూస్వాములపై, వారికి సహకరిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని, అడిగిన వారందరికీ జాబు కార్డులు ఇచ్చి వెంటనే వేతన బకాయిలు విడుదల చేయాలని, అడిగిన వారందరికీ పనులు కల్పించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే మండలంలోని ఉపాధి హామీ కూలీలందరినీ ఐక్యం చేసి ఎంపిడిఒ కార్యాలయం ముట్టడిస్తామని ఆయన ఉపాధి హామీ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జోడే సూర్యచంద్రరావు, యాగంటి సీతా, వామిశెట్టి నరసరావు, పిల్లి చంటి పాల్గొన్నారు.



ఎంపిడిఒకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాత పద్ధతిలోనే భూములు రిజిస్ట్రేషన్ చేయాలి

టిడిపి నేత గంటా సత్యంబాబుకు ప్రయివేట్ దస్తావేజు లేఖరుల వినతి

కామవరపుకోట :పాత పద్ధతిలోనే భూములు రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ మండల ప్రయివేట్ దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షులు నల్లమిల్లి రవికుమార్ టిడిపి నాయకులు గంటా సత్యం బాబుకు వినతిపత్రం అందించారు. స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ప్రయివేట్ దస్తావేజు లేఖరులందరూ కలిసి సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని టిడిపి నాయకులు గంట సత్యంబాబుకు అందించారు. ఈ సందర్భంగా లేఖరుల సంఘం అధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రైమ్ 2.0 జిఒ వల్ల ప్రజలు, దస్తావేజు లేఖరులు నష్టపోతారని తెలిపారు. రాజ్యాంగపరంగా వచ్చిన రిజిస్ట్రేషన్ హక్కును గత వైసిపి ప్రభుత్వం మంటగలిపే ప్రయత్నం చేసిందని, అందుకే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం పూర్వపు పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ కార్యక్రమాలను నిర్వహించేలా చేయాలని దస్తావేజు లేఖరులందరూ ముక్తకంఠంతో కోరారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందుకున్న టిడిపి నాయకులు గంటా సత్యంబాబు మాట్లాడుతూ దస్తావేజు లేఖరుల సమస్యను ఎంఎల్ఎ, ఎంపీ దృష్టికి తీసుకెళ్లి తద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ దస్తావేజు లేఖరులు పజ్జూరి రాము, పెరవలి రాజేంద్రప్రసాద్, రామకృష్ణ, రాజాజీ, దాసరి సుబ్బారావు పాల్గొన్నారు.


విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలి

జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షులు మణికంఠ

ప్రజాశక్తి - భీమడోలు

జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని, జిఒల అమలుకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖను జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షులు ఎల్.మణికంఠ కోరారు. భీమడోలు మండలం పూళ్ల గ్రామంలో ఉన్న కమిషన్ జిల్లా కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో మణికంఠ మాట్లాడారు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలు నిర్దేశించిన ఫీజుల కన్నా అనేక రెట్లు ఎక్కువగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నారన్నారు. ఫీజులు ఎక్కువగా వసూలు చేయడంతో పాటు వాటికి అనుబంధంగా నియమాలకు విరుద్ధంగా ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలలు కొనసాగిస్తున్న విధానాలను నిరోధించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమిషన్ జిల్లా సమన్వయకర్త కె.రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు గంగాధరరావు, తులసీరామ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



సొంగా రోషన్‌కుమార్‌ను అభినందిస్తున్న నాయకులు

సొంగా రోషన్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి కూటమి విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరినీ గుర్తు పెట్టుకుంటానని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. రోషన్‌కుమార్‌ను ఏలూరులోని ఆయన స్వగృహం వద్ద టిడిపి చింతలపూడి నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి, మండలాధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, ప్రగడవరం ఎంపిటిసి మాజీ సభ్యులు కనమత రెడ్డి రాజారెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు టిడిపి సీనియర్ నాయకులు, టౌన్ మాజీ అధ్యక్షులు బందెల ఆశీర్వాదం, ఎస్‌సి సెల్ సెక్రటరీ ధారా వీరేంద్ర, ఎస్‌సి సెల్ మండల వైస్ ప్రెసిడెంట్ వైవి.సత్యనారాయణ, మండల సెక్రటరీ గడిదేసి ఏసు ఉన్నారు.

రోషన్‌కుమార్‌ను కలిసిన సచివాలయ సిబ్బంది

మండలంలోని రూరల్, టౌన్ సచివాలయ సిబ్బంది ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలందించాలని చెప్పారు.

వృద్ధురాలికి వీల్‌చైర్ అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న 85 ఏళ్ల వృద్ధురాలికి అగాపే సంస్థ వ్యవస్థాపకులు బిరుదుగడ్డ ఆశిబాబు ఆర్థిక సహకారంతో వీల్‌చైర్ అందించారు. పట్టణంలోని సూరపరాజు కాలనీ అగాపే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు బిరుదుగడ్డ ఆశిబాబు ఇంటి వద్ద విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన వృద్ధురాలు పారేపల్లి బసవమ్మకు రూ.20 వేల విలువైన వీల్‌చైర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత బిరుదుగడ్డ ఆశిబాబు మాట్లాడుతూ డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు అమృతల రంగా ద్వారా వృద్ధురాలి దీన పరిస్థితి తన దృష్టికి రావడంతో వెంటనే వీల్ చైర్ సమకూర్చినట్లు చెప్పారు. సామాజిక వేత్త కెవిఎన్.ధనకుమార్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సేవలో ఆశిబాబు వ్యక్తిగత వితరణ, దాతల తోడ్పాటుతో గత 30 సంవత్సరాలుగా విభిన్న ప్రతిభావంతులకు అందిస్తున్న ఉచిత సేవ ఆదర్శనీయమన్నారు. దీనికి ఆశిబాబు తల్లి కాంతమ్మ, కుటుంబ సభ్యులు మణికుమారి, భానుప్రకాష్ సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు అమృతల రంగా, గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకర్, ఉపాధ్యక్షులు ఎల్.శ్రీనివాస్, కార్యదర్శి పఠాన్ బాజీ, సహాయ కార్యదర్శి చల్లా రామకృష్ణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

గ్రామీణ ప్రాంతంలో గర్భిణులకు, బాలింతలకు అందించాల్సిన సేవలు సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ సూచించింది. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిని నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ టీమ్ ప్రగడవరం సచివాలయం-2ని సోమవారం సందర్శించింది. క్షేత్రస్థాయిలో గర్భిణులకు, బాలింతలకు రక్తహీనత రాకుండా చేపడుతున్న చర్యను పరిశీలించారు ఆసుపత్రిలో సుఖ ప్రసవలకు కావాల్సిన వ్యాధి నిరోధక టీకాలు, చర్మవ్యాధులకు చికిత్స, అంటువ్యాధులపై, నివారణ చర్యలపై సమీక్ష జరిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక శాఖాధికారి పి.శ్రీనివాసరావు, డిపిహెచ్ఎ జ్యోతి, ఎన్‌హెచ్ఎం సురేష్ ,భరత్, వెంకట్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఉపాధి కూలీలు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని వేల్పుచర్ల, ఎల్లాపురం, బలివే, చిల్ల బోయినపల్లి, కాట్రేనిపాడు, గోపవరం, ముసునూరు గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సమక్షంలో సోమవారం మొక్కలు నాటారు. ఎంపిడిఒ చాగంటి పద్మావతిదేవి ఆధ్వర్యంలో ఎపిఒ రోజ్ లీలా అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు ముసునూరు గ్రామంలో జెడి శీలం కమిటీ హాలు స్థలం వద్ద సర్పంచి కొండేటి విజయలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు చీలి లక్ష్మిలు మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో ఇసి జయప్రకాష్, ఎఫ్ఎ బి.వలీవ, ముసునూరు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఆలయంలో నిధికి విరాళం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల కేంద్రమైన ఆగిరిపల్లిలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో నిత్య, ధూప, దీప, నైవేద్యాల కోసం ఏర్పాటు చేసిన నిధికి దాతలు విరాళాలు అందించారు. శ్రీరామ్ హరిప్రసాద్, శ్రీకాకుళపు వెంకట నాగేంద్ర రూ.2 లక్షలు, దూపగుంట్ల రాజ్యలక్ష్మి జ్ఞాపకార్థం వారి మనుమడు యండూరి ప్రణీత్ రూ.50వేలు ఆలయ కమిటీ కార్యదర్శి మడుపల్లి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు బెజవాడ ముత్యాలుకు వితరణగా అందించారు.

'కూటమిని గెలిపించినవారికి కృతజ్ఞతలు'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

టిడిపి కూటమిని గెలిపించిన అందరికీ కృతజ్ఞతలు అని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ మేఘలదేవి అన్నారు. ఆమె మండలంలోని అన్ని పంచాయతీల్లో సోమవారం తిరిగి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసిపి పాలనలో నాయకులు ప్రజలను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఎవరు ఎంఎల్‌ఎగా గెలిచారో, ఎవరు మంత్రి అన్న విషయం కూడా ప్రజలకు తెలియదన్నారు. వైసిపి నాయకులు గెలిచిన తరువాత ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించలేదన్నారు. అభివృద్ధి అనే మాటే వారికి గుర్తు లేనట్లు వారి పాలన సాగిం దన్నారు. అందుకే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఎవరూ అధైర్య పడవద్దని, టిడిపి కూటమి ప్రభుత్వంలో ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు.

నేరాలు - ఘోరాలు

జలాశయంలో దిగి యువకుడు మృతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని దొర మామిడి సమీపంలోని అలివేరు గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయంలో స్నానం చేసేందుకు దిగిన యువకుడు మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సరిపల్లి గ్రామానికి చెందిన కడారి దుర్గా సాయికుమార్ ఆదివారం స్నేహితులతో కలిసి గుబ్బల మంగమ్మ ఆలయం దర్శనానికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా దొరమామిడి సమీపంలోని అలివేరు గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయంలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ సాయికుమార్ గల్లంతయ్యాడు. దీంతో స్నేహితులు పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రెవెన్యూ సిబ్బంది పోలీసు యంత్రాంగం జలాశయంలో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం సాయికుమార్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. యువకుని మృతితో సరిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మర్మాంగాన్ని కోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన జీలుగుమిల్లి మండలంలోని రామన్నపాలెం కాలనీలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రామన్నపాలెం గ్రామానికి చెందిన దాసరి భద్రయ్య (60) మర్మాంగాన్ని కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన 108 అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి వైద్యులు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

అక్రమార్కుల చెరలో కాలువ గట్టు

చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టు భూమిలో దర్జాగా సాగు చేసుకుంటున్న భూస్వాములు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని కృష్ణాపురం, పుట్రేపు గ్రామాల మధ్యలో ఉన్న చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టు ఆక్రమణకు గురైంది. కొందరు ఆక్రమణదారులు కాలువ గట్టు భూమిని ఆక్రమించి దర్జాగా సాగు చేసుకుంటున్నారు. సుమారు వందల ఎకరాలకు పైగా మిగులు భూమిలో స్థానిక భూస్వాములు కొందరు భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసుకుని మరీ భూమిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా ఆ భూముల్లో మొక్కజొన్న, పామాయిల్ వంటి పంటలు సాగు చేసుకుని కాసులు దండుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని, అదే పేదలు ప్రభుత్వ భూములను ఆక్రమించి సాగుచేస్తే వారిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారని, పెద్దలు చేస్తే మాత్రం నిమ్మకు నీరెత్తనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. వెంటనే ఉన్నతస్థాయి అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



కాలువ గట్టు భూమిలో సాగు చేస్తున్న మొక్కజొన్న

సుమారు 15 ఏళ్ల క్రితం పోలవరం ప్రాజెక్టు నుంచి చింతలపూడి మెట్ట ప్రాంతానికి సాగునీటిని అందించేందుకు చేపట్టిన చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం భూ సేకరణ చేశారు. తరువాత తవ్వ కాలు కూడా జరిగాయి. మండలంలోని మక్కి, నవరిగూడెం, గంగినిడుపాలెం, బండి వారిగూడెం, పుట్రేపు, కృష్ణాపురం గ్రామాల మీదుగా కాలువ తవ్వకాలు సాగాయి. అయితే నిధుల కొరత, చింతలపూడి రైతులు అధిక నష్టపరిహారం కోసం కోర్టులో పిటిషన్ వేశారు. దీంతో పదేళ్ల క్రితం తవ్వకాలు నిలిచిపోయాయి. ఇటీవల గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి కాంట్రాక్టు దారులు కృష్ణాపురం, పుట్రేపు మధ్య కాలువ గట్టు మట్టిని తవ్వి హైవేకి తరలించారు. దీంతో కాలువ గట్టుపై ఉన్న మట్టి ఖాళీ అవ్వడంతో ఇదే అదునుగా భావించిన స్థానిక భూస్వాములు కొందరు ఆ మిగులు భూములను ఆక్రమించి జెసిబిలతో చదును చేయించుకుని కాలువ వెంబడి భూముల చుట్టూ ఫెన్సింగ్‌లు సైతం ఏర్పాటు చేసుకుని దర్జాగా సాగు చేసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆ భూముల్లో మొక్కజొన్న, పామాయిల్, కోకో పంటలు సాగు చేసుకుని లాభాలు పొందుతున్నారని పలువురు చెప్పుకుంటున్నారు. కాలువ గట్టు భూములు ఆక్రమణకు గురవ్వడం ద్వారా స్థానిక గ్రామాలకు చెందిన రైతులు, పేదలు పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, భూస్వాములకు కొమ్ము కాస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూములను పేదలు ఆక్రమిస్తే మాత్రం వారిపై కేసులు పెట్టి బెదిరిస్తారని, భూస్వాములు ఆక్రమిస్తే చర్యలేవని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.



కాలువ గట్టు భూమిని ఆక్రమించి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్



కాలుటగట్టు భూమిలో చదును చేస్తున్న జెసిబితో

ఏలూరులో క్రాఫ్ట్ బజార్ ప్రారంభం

కేవలం రూ.10 నుంచే వస్తువులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులో భారతీయ హస్తకళ ప్రదర్శన క్రాఫ్ట్ బజార్ ప్రారంభమైంది. కేవలం రూ.10 నుంచే హస్త కళా వస్తువులను కొనుగోలు చేసుకోవచ్చు. ఏలూరు పట్టణంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న టిటిడి కళ్యాణ మండపంలో విజయవాడకు చెందిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్రాఫ్ట్ ఇండియా వారి హస్తకళా ప్రదర్శన క్రాఫ్ట్ బజార్‌ను ఏర్పాటు చేశారు. ఈ బజార్‌లో క్వాలిటీ గల జైపూర్ బెడ్స్, మట్టి కుండలు, పింగాణీ పాత్రలు, చిన్నారులు ఆడుకునే ఆట వస్తువులు, మంచి డిజైన్ గల మహిళల డ్రస్సులు ఉన్నాయి. ఇక్కడ పది రూపాయల నుంచి వెయ్యి రూపాయల ధర వరకు కావాల్సిన వస్తువులు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ప్రజలు ఎక్కువగా ఉండే చోట, రద్దీ ప్రదేశాల్లో , మార్కెటింగ్ క్రయ, విక్రయాలు కొనసాగుతాయో అక్కడ క్రాఫ్ట్ బజార్ పెట్టి క్వాలిటీ వస్తువులను అందిస్తున్నారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన వ్యాపారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ క్రాఫ్ట్‌బజార్‌ను పట్టణాల్లోనే కాకుండా పెద్ద పెద్ద నగరాల్లో కూడా పెట్టి క్వాలిటీ గురించి అందరూ చర్చించుకునేలా అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. క్రాఫ్ట్ బజార్‌లో ప్రత్యేకంగా ఇంటి అందాన్ని పెంచే కర్టన్స్, తలకడ దిండులు, ఇంటి గుమ్మం ముందు ఉంచే డిజైన్ ఐటమ్స్ ఉన్నాయన్నారు. అన్ని రకాల రంగురంగుల వస్తువులు ఉన్నాయని చెప్పారు. ఏ వస్తువు చూసినా ఆకర్షణీయంగా కనబడుతున్నాయన్నారు. ఇక్కడ సుమారుగా 40 మంది ఉపాధి పొందుతున్నారన్నారు. ఈ క్రాఫ్ట్ బజార్ ప్రవేశం పూర్తిగా ఉచితమని, ఈ ప్రదర్శన ఇంకా కొన్ని రోజుల మాత్రమే ఉంటుందని చెప్పారు. ఈ ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఇక్కడ తయారీదారులచే నేరుగా అమ్మకం జరుగుతుందని తెలిపారు.



క్రాఫ్ట్‌బజార్


ఈ క్రాఫ్ట్ బజార్‌లో మట్టితో తయారుచేసిన వస్తువులు ఆకర్షణగా నిలిచాయి. అందులో మట్టి కుండలు, భోజనం చేయడానికి డిజైన్ ప్లేట్స్, మొక్కలు పెంచుకునే కుండీలు, చిన్నపిల్లలు ఆడుకునే పింగాణి బొమ్మలు రంగురంగులుగా ఇక్కడ దర్శనమిస్తాయి. అదేవిధంగా స్త్రీలకు కావాల్సిన మేకప్ కిట్స్, పెన్నులు, జడ కుచ్చులు, బొట్టు బిళ్లలు వంటివి చాలా తక్కువ ధరకు దొరుకుతున్నాయి. భారతీయ సంస్కృతిలో ప్రాచుర్యం పొందిన బొమ్మలు అందరిని ఆకర్షిస్తున్నాయి. ఈ ప్రదర్శనలో ఖాదీ వస్త్రములు, బెంగాలీ కాటన్ చీరలు, ఇమిటేషన్ జ్యువెలరీ, కలంకారి డ్రస్సులు, పింగాణీ పూల కుండీలు, రెడీమేడ్ డ్రస్సులు అందుబాటులో ఉన్నాయి. ఏ వస్తువు కొనుగోలు చేసినా క్వాలిటీలో చాలా బాగున్నాయని కొనుగోలుదారులు అంటున్నారు. ఏలూరు ప్రజలు క్రాఫ్ట్ బజార్‌కు వచ్చి సందర్శించి కొనుగోలు చేయాలని, ఇటువంటి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని చేనేత కార్మికులు కోరుతున్నారు.

అభినందనీయులు వట్టి వసంతకుమార్

జయంతి వేడుకలో వక్తలు

ప్రజాశక్తి - భీమడోలు

మంత్రిగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి, ఎంఎల్‌ఎగా ఉంగుటూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన మాజీ మంత్రి వట్టి వసంత కుమార్ అభినందనీయులని, పలువురికి స్ఫూర్తి ప్రదాత అని, ఆయన ఆశయాలు రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయమని పలువురు వక్తలు అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని జనసేన పార్టీ నాయకులు, వట్టి వసంత కుమార్ అభిమానులు భీమడోలు మండలంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. దీనిలో భాగంగా భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, పాలు, పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత, మత్తువైద్య నిపుణులు అశ్విని, సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న సేవలు, అందుబాటులో ఉన్న వసతుల గురించి వారికి వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వైద్యశాల ఆవరణలో మొక్కలను నాటారు. 2008లో ఎంఎల్‌ఎగా వట్టి వసంత్ కుమార్ నియోజకవర్గ అభివృద్ధి నిధులతో భీమడోలు సంతపేటలో నిర్మించిన గోదావరి జలాలను అందించే నీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అది మరమ్మతులకు చేరుకుని నిరుపయోగంగా ఉంది. వట్టి వసంతకుమార్ జయంతి పురస్కరించుకుని జనసేన పార్టీ నాయకులు, వట్టి వసంత కుమార్ అభిమానులు సదరు ట్యాంకుకు మరమ్మతు చేసి సోమవారం నుంచి వినియోగంలోకి తెచ్చారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వర్ధినీడి వెంకటేశ్వరరావు (సత్య సాయి), తమ్మన రామకృష్ణ, కె.లక్ష్మణ్ పాల్గొన్నారు.



రోగులకు పండ్లు, పౌష్టికాహారం అందిస్తున్న వక్తలు

వైసిపి మండలాధ్యక్షుడు నరసింహారావు రాజీనామా

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వైసిపి మండలాధ్యక్ష పదవికి చిన్నాగిరిపల్లికి చెందిన పల్లగాని నరసింహారావు రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా పత్రాన్ని వైసిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు ఆళ్లనానికి అందించారు. వైసిపి ఏర్పాటు అయినప్పటి నుంచి పార్టీ మండలాధ్యక్షులుగా కొనసాగానని చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపికి ఎప్పుడూ లేని విధంగా ఆగిరిపల్లి మండలంలో 3700 ఓట్ల మెజారిటీ రావడంతో నైతిక బాధ్యత వహిస్తూ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నానని, తనకు సహకరించిన వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు అన్నారు. మండలంలోని రాజుపోతేపల్లి గ్రామంలో తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో సోమవారం రామోజీరావుకు సంతాప సభ ఏర్పాటు చేసి ఆయన సేవలను కొనియాడారు. ముందుగా రామోజీ రావు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ రామోజీరావు ఈనాడు గ్రూపు సంస్థల అధినేతగా, పారిశ్రామిక వేత్తగా, పాత్రికేయునిగా ఎనలేని సేవలందించారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నెక్కలపూడి రామచంద్రరావు, దావులూరి కృష్ణ, కేసిన వెంకటేశ్వరరావు, పడమటి శివ, ఉండవల్లి చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలకు కాలినడకన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ముసునూరు


మండలంలోని వేల్పుచర్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకులు వేల్పుచర్ల గ్రామం నుంచి కాలి నడకన ద్వారకాతిరుమల (చిన్న తిరుపతి) చేరుకుని తమ మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు రాష్ట్రం అభివృద్ధి చెందాలని, నూజివీడు ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారథిని మంత్రి పదవి వరించాలని, దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌ని మంత్రి పదవి వరించాలని, టిడిపి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఢిల్లీలో పోరాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని, నూజివీడు నియోజకవర్గంలోని చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తయ్యేలా చూడాలని వేడుకున్నట్లు తెలిపారు.

శిథిలావస్థ మంచినీటి పథకాల తొలగింపు

ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ శాస్త్రి

ప్రజాశక్తి - మండవల్లి

శిథిలావస్థకు చేరిన రక్షిత మంచినీటి పథకాల తొలగింపునకు చర్యలు చేపట్టినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ శాస్త్రి తెలిపారు. ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎంఎస్.చైతన్యతో కలిసి పెనుమకలంక దయ్యంపాడు రక్షిత మంచినీటి పథకాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షిత మంచినీటి పథకాలను నిర్మించి సుమారు 30 ఏళ్లవుతుందన్నారు. అయితే ఆ పథకాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. వాటిని ముందుగానే తొలగిస్తే ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని, నాణ్యతను, పటిష్టతను పరిశీలించమని శాస్త్రవేత్త ఎంఎస్.చైతన్యను కోరినట్లు చెప్పారు. ఆయన పథకాల వద్దకు వచ్చి వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించిన శాస్త్రవేత్త రెండు రోజుల్లో నివేదిక అందిస్తామని చెప్పారన్నారు. శాస్త్రవేత్త ఇచ్చిన నివేదిక ఆధారంగా కాలం చెల్లిపోతే తొలగించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం ఆ ప్రాంతంలో జల జీవన మిషన్ ద్వారా రక్షిత మంచినీటి పథకాలను నిర్మించి తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూసి ఎఇ కృష్ణారావు, సర్పంచి నాగరాజు, కార్యదర్శులు ప్రభాకర్, తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మంచినీటి పథకాలను పరిశీలిస్తున్న చైతన్య, శాస్త్రి

ఘనంగా బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - చింతలపూడి

ఎన్‌టిఆర్ కుమారుడిగానే కాకుండా బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ పెట్టి ఎంతోమంది పేదవారికి, నిర్భాగ్యులకు అండదండగా బాలయ్య ఉంటున్నారని చింతలపూడి టిడిపి నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం, బాలయ్య మండల ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తక్కెళ్లపాటి రమేష్ అన్నారు. నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు చింతలపూడిలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద బాలయ్య ఫ్యాన్స్ మండల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌సి సెల్ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు పల్లి శ్రీను, ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్ ఆధ్వర్యంలో సుప్రీంపేట ఎంపిటిసి మాజీ సభ్యులు కాటూరి వెంకటేశ్వరరావుకు వీల్‌చైర్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, సీనియర్ నాయకులు తాటి అప్పా రావు, నల్లమాటి శ్రీను, తిరుమిల్లి రామారావు, పొదిలి రాయప్ప, హెచ్చు యోహాను, బాలయ్య ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సొరకాయల జయరాజు, ఎస్‌సి సెల్ మండలాధ్యక్షుడు నందిపాము నాగేశ్వరరావు, ఎస్‌సి సెల్ టౌన్ కార్యదర్శి సొంగా పాదం, వెంకీ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : బాలకృష్ణ 64వ పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఆయన అభిమానులు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు కొయ్యలగూడెం సెంటర్‌లో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు జె.రామకృష్ణ మాట్లాడుతూ నందమూరి బాలకృష్ణ బసవతారకం వంటి హాస్పిటల్ కట్టి ఎంతో మంది పేద ప్రజలకు వైద్యం అందిస్తున్నారన్నారు. తెలుగు దేశం పార్టీకి ఎనలేని సేవ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చింతలపూడిలో...

ముసునూరు : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కార్యాలయంలో బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. నూజివీడు పట్టణంలోని ఎంఎల్‌ఎ కొలుసు పార్థసారథి కార్యాలయంలో, ముసునూరు మండలంలోని 16 గ్రామాల్లోని టిడిపి యువ నాయకులు, అధ్యక్షులు, బాలకృష్ణ అభిమానుల ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కలిదిండి : మండలంలోని మట్టగుంటలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు. తిరుమాని పాండురంగారావు, చిన్నికృష్ణ, కొపనాతి వెంకటేశ్వరరావు, తిరుమలశెట్టి ఈశ్వర పరశురాముడు, నరసింహస్వామి, మోకా శంకరరావు పాల్గొన్నారు.

ఘనంగా పారేపల్లి రామారావు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - పోలవరం

టిడిపి పోలవరం నియోజకవర్గ నాయకులు పారేపల్లి రామారావు పుట్టినరోజు వేడుకలకు పోలవరం మండలం నుంచి అధిక సంఖ్యలో టిడిపి శ్రేణులు కొయ్యలగూడెం తరలి వెళ్లారు. పారేపల్లి రామారావుకు ఆయన నివాసం వద్ద పూలమాలలు వేసి పుష్పగుచ్ఛాలు అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ మండలాధ్యక్షులు పాపోలు గణపతి రత్తయ్య, తెలుగు యువత అధ్యక్షులు పెద్దేహపు సత్యనారాయణ, టిడిపి గూటాల సీనియర్ నాయకులు ఏనుగుల శ్రీనివాస్, కొంజర్ల సత్యనారాయణ ఉన్నారు.

వైసిపి నాయకులపై దాడి సరికాదు

మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడి సరికాదని పోలవరం మాజీ ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు అన్నారు. దుద్దుకూరు క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం నియోజకవర్గంలో మూడుసార్లు ఎంఎల్‌ఎగా పని చేసిన తన పరిపాలన సమయంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలను, ప్రతిపాక్ష పార్టీ నాయకులను ఇబ్బంది పెట్టలేదన్నారు. సరిపల్లి గ్రామ సచివాలయంలో జనసేన పార్టీ కార్యకర్తలు దాడి చేశారని, వేలేరుపాడు మండలంలో వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడి చేశారని చెప్పారు. గెలిచిన అభ్యర్థులు పోలవరం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేయడానికి తమ కార్యకర్తలను, నాయకులను ఉపయోగించుకోవాలన్నారు. ప్రతిపక్ష పార్టీపై దాడులకు దిగడం అమానుషమన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, తాను అండగా ఉంటానని చెప్పారు.